# అభివృద్ధి చేయని గల్లీ లేదు.. సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదు..

### ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల

ఖలీల్వాడి, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నగరంలోని 25, 48వ డివిజన్లలో బుధవారం ప్రచారం చేశారు. ఆయనకు ఆయా డివిజన్ల మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. డివిజన్లలోని ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ సహకారంతో నగరంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి చేయని గల్లీ లేదని, సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్యాంక్‌బండ్, ఆధునిక సదుపాయాలతో నిర్మించిన వైకుంఠధామాలు ప్రగతికి నిదర్శనమని బిగాల అన్నారు. యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ కోసం న్యాక్ భవనం నిర్మించామన్నారు. ఐటీ టవర్ నిర్మించి 400 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ప్రగతికి మారుపేరుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని, మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు గుజ్జేటి వెంకటనర్సయ్య, ఎనుగందుల మురళి, 48వ డివిజన్ నాయకులు సత్యపాల్, పుంద్ర నరేశ్‌రెడ్డి, రేసు హన్మాండ్లు, పబ్బ సాయిప్రసాద్, 25వ డివిజన్ కార్పొరేటర్ సిరిగాధ ధర్మపురి, కోఆప్షన్ సభ్యురాలు అంతరెడ్డి లతా దేవేందర్, చింతకాయల రాజు, పుప్పాల రవి, కస్తూరి గంగరాజు, శివప్రసాద్, పాలకొండ నర్సింగ్‌రావు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న బిగాల

ప్రచారం చేస్తున్న బిగాల గణేశ్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## ముహూర్తం బాగుందా..?

■ శుభ ఘడియలపై నేతల ఆరా

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియను ప్రారంభించేందుకు ఇంకా ఒకరోజు సమయం ఉన్నది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3న నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నేతలు మంచి ముహూర్తాల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. ఏ రోజున నామినేషన్ వేయాలి? ఏ రోజున ముహూర్తం బాగుంది? అనే విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. నామినేషన్ వేసేందుకు ఈ నెలలో 3, 4, 8, 9, 10 తేదీల్లో తిథి, వార, నక్షత్ర బలాలు బాగున్నాయని పండితులు సూచిస్తున్నారు. ముహూర్త బలం అభ్యర్థుల విజయ అవకాశాలపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుందని జ్యోతిష్య పండితులు పేర్కొంటున్నారు.

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిన మున్నూరుకాపులు



గన్నారం నుంచి సమ్మేళనానికి తరలుతున్న మున్నూరుకాపు కులస్తులు

జక్రాన్‌పల్లి/ఇందల్వాయి, నవంబర్ 1 : డిచ్‌పల్లిలోని బృందావన్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వివిధ మండలాలు, గ్రామాల నుంచి మున్నూరుకాపులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. జక్రాన్‌పల్లి మండలంలోని చింతలూర్ సర్పంచ్ సుకన్యాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మున్నూరు కాపు సంఘ సభ్యులు ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

## బాజిరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం



బాజిరెడ్డికి మద్దతు తెలిపేందుకు సమావేశమైన పెరిక కులస్తులు

ఇందల్వాయి, నవంబర్ 1 : మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పెరిక సంఘం సభ్యులు బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని ఎంపీపీ రమేశ్ నాయక్‌కు అందజేశారు. రూరల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, మండల అధ్యక్షుడు దాసు, ఎస్సీ సెల్ రూరల్ కన్వీనర్ పాశం కుమార్, సర్పంచ్ తేలు విజయ్‌కుమార్, ఎంపీటీసీ అశ్వినీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్, నాయకులు రఘు, పెరిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలో పట్టుబడ్డ నగదు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్సై నీరేశ్, సిబ్బంది

రుద్రూర్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేథప్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. మండలంలోని అక్బర్‌నగర్ రహదారిపై పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రసీదులు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎసై నీరేశ్ వెల్లడించారు. నగదును సీజ్ చేసి బాన్సువాడ ఆర్వోకు అప్పగించినట్లు తెలిపారు.

## నేడు గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

■ హాజరుకావాలని బాజిరెడ్డి, వీజీ గౌడ్‌కు ఆహ్వానం

నిజామాబాద్ రూరల్, నవంబర్ 1 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో నేడు (గురువారం) రూరల్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. సమ్మేళనానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌ను గౌడ సంఘం నాయకులు బుధవారం కలిసి ఆహ్వానించారు.



బాజిరెడ్డి, వీజీగౌడ్‌ను సన్మానించి ఆహ్వానిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

## బీఆర్ఎస్ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చింది

మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఖలీల్వాడి, నవంబర్ 1 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చిందని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతర విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంట్‌ను ఇచ్చి దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉండేలా చేసిందని ప్రశంసించారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేశారని, కనీస అవసరాల కోసం వివిధ రకాల పెన్షన్లు వర్తింపజేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకొని, ఫిట్‌మెంట్‌తో వేతనాలు సాధించాలని, 317 జీఓతో నష్టపోయిన వారికి న్యూమరీ పోస్టర్ ద్వారా న్యాయం చేయాలని కోరారు. ప్రత్యేక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గ్రామ ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని, మూడు డీఏలను మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.మోహన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరమల్ల నర్సింగ్‌రావు, మాజీ రాష్ట్ర బాధ్యులు సముద్రాల రాములు పాల్గొన్నారు.

## 'కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఖలీల్వాడి, నవంబర్ 1 : మెదక్ ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిచేసిన కాంగ్రెస్ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో శాంతియుతంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ శాంతియుతంగా రాష్ట్రాన్ని ప్రగతి వైపు పరుగెత్తిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావాలని హింసా రాజకీయాలకు పాల్పడడం దారుణమన్నారు. కత్తితో దాడి చేసి హత్యా రాజకీయాలకు తెర లేపిన కాంగ్రెస్ నాయకుల తీరు దురదృష్టకరమన్నారు. ఎన్నికల్లో గెలువాలంటే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాక్షేత్రంలో పోరాడాలి తప్ప హింసా రాజకీయాలు చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, యువజన విభాగం అధ్యక్షుడు బొబ్బిలి మురళి, బీఆర్ఎస్వీ నగర అధ్యక్షుడు రంగు సీతారాం, మాజీ కార్పొరేటర్ శివ చరణ్, సాధు సాయివర్ధన్, మాజీ కార్పొరేటర్లు సిర్ప సువర్ణ, పుప్పాల లావణ్య, రంగు అపర్ణ, నాయకులు నిచెంగ్ కృష్ణ, చిదుర శ్రీను, పాల్తి రవికుమార్, సంపత్, మాదని శ్రీధర్, భాజన్న, పద్మ, శ్రీను పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నగర మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు

## పోచారానికి మద్దతుగా ప్రచారం

మోస్రా (చందూర్), నవంబర్ 1 : మోస్రా మండలంలోని చింతకుంటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగుల స్వామి, భూమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

## 'బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి'



లింగితండాలో బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్, నవంబర్ 1 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రూరల్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని లింగితండా గ్రామంలో బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, నాయకులు బొల్లెంక గోపాల్‌రెడ్డి, ప్రేమ్‌దాస్‌నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ముత్తకుంట సొసైటీ చైర్మన్ స్వామి, సర్పంచులు జలంధర్‌గౌడ్, అరుణ, గోపాల్‌నాయక్, బొంత సాయిలు తదితరులు పాల్గొన్నారు.